# కాలమ్‌దాటని కథలు

## పెళ్ళికి ముందు

"మీ పెళ్ళయి ఎంత కాలమైంది?"

"రెండు నెలలు!"

"అంతకుముందు అనుభవం లేదా?"

"లేదు"

"అదీ- అందుకే విఫలులయ్యారు. మీ భార్య మీతో సహకరించటం లేదా?"

"సహకరించేందుకు ఆమెకూ్కడా తెలియదు"

"పోనీ మీ స్నేహితుల్ని అడగలేదా సలహా?"

"ఈ విషయం అడగడానికి అభిమానం అడ్డువచ్చింది!!"

"పోనీ వాళ్ళ మాటల్లో రాబట్టలేక పోయారా?"

"వాళ్ళమాటలనుబట్టి వాళ్ళెవరికీ యీ సమస్యఎదురైనట్లు లేదు. లేదా వాళ్ళ భార్యలు సహకరిస్తారో?"

"మీరు సిగ్గుపడకండి. ఇదేమంత చిన్నతనంగా భావించాల్సిన విషయం కాదు. ప్రతి మగవాడు ప్రథమ ప్రయత్నంలో విజయుడవ్వడు ఈ విషయంలో. కొంత అనుభవం వచ్చేదాకా సర్దుకోవాలి!"

"నేను సర్దుకున్నా మా ఆవిడ సర్దుకోవాలిగా! ఇంతకీ నేను పెళ్ళికి ముందు నేర్చుకోపోబట్టి కదా ఈ అవస్థ"

"ఫర్వాలేదు. మీ ప్రక్క వాటా వారిని రహస్యంగా గమనించండి. వాళ్ళేం చేస్తున్నారో! ఎదురింట్లోకి కన్నేసి ఉంచండి! మీరు ఈ కాస్తకే భయపడితే ఎలా? ఏళ్ళ తరబడి చేసినా కూడా నేర్చుకోవలసింది చాలా వుంటుంది ఈ రంగంలో…"

"ఐతే నిజంగా నేను వంట చెయ్యడం నేర్చుకోగలనంటారా?" ఆశగా అడిగాడు కొత్త పెళ్ళికొడుకు వంటమనిషిని.

"తప్పకుండా! వంటచెయ్యటం ఘన కార్యం కాదు. పెళ్ళికి ముందు నేర్చుకోవలసింది అని పశ్చాత్తాపపడేందుకు. ప్రతి భర్తకి పెళ్ళయిన మొదట్లో ఎదురయ్యే సమస్య ఇది. మొదట సరదాగా ప్రారంభించి శ్రీమతికి సాయం చేయాలన్న ఉబలాటంతో మొదలై చివరికి అలవాటు కింద మారి ఆపై బాధ్యతకింద తయారవుతుంది.

ఒకరితో ఒకరు సహకరించి సహనంతో నేర్చుకోవలసిన విద్య వంట! పెళ్ళికిముందు వంటలో అనుభవం వుంటే ఇంత "థ్రిల్" ఉండదు. అలవాటైపోతుంది."

ఆ మాటలు జాగ్రత్తగా పదిలపరచుకుంటున్నాడు కొత్త పెళ్ళికొడుకు మనసులో.

—శివలెంక లక్ష్మీదేవి

## రస సిద్ధి

బాత్‌రూం తలుపు స్లోగా తెరుచుకొంది.

శాండల్‌వుడ్ పరిమళం గదంతా పరచుకొంది ఆమె మెల్లగా బయటకు వచ్చింది. వక్షాన్ని కప్పుతూ మోకాళ్ళ పైదాకా తెల్లటి టవల్ చుట్టుకొంది. ఫాన్ గాలికి ఎగురుతున్న టవల్ అంచులు దాగున్న



పరువాలను కొద్దికొద్దిగా బహిర్గతం చేస్తున్నాయి. ఆమె ఒళ్ళు సిమ్లా ఆపిల్‌లా నిగనిగలాడుతోంది. గుండ్రని అనాఛ్ఛాదిత భుజాలు వింతగా ప్రకాశిస్తున్నాయి. ఫాల భాగంమీద. శ్రీకారాల్లాంటి చెవుల అంచుల మీద తెల్లని సబ్బునురగ పాలమీగడలా మెరుస్తోంది. నిశ్శబ్దంగా నడుచుకుంటూ డ్రెస్సింగ్ టేబుల్ ముందుకు వెళ్ళింది. వీపు మీద జీరాడుతున్న వెంట్రుకలను సుతారంగా ముందుకు లాక్కొని గుండెల మీదకు వదిలింది. మెల్లగా టవల్‌ను వదులు చేసింది. అది గుండెల మీంచి జారి. పొత్తికడుపు దాటి పిరుదులను రాచుకుంటూ. పాదాల మీద దాసోహం అంది. అనాచ్ఛాదితమైన ఆమె గులాబి రంగు ఒంటి మీద మెడ క్రిందుగా వీపు మీద. తామరాకుమీది నీటి బిందువుల్లా తామరాకు మీది…. తామర…. తామర….."

తదేకంగా చదువుతూ తన్మయావస్థలో మునిగిన వీరసామి ఉలిక్కిపడ్డాడు. "అవునూ! ఇవాళే కదూ! తామర స్పెషలిస్ట్ శుక్రాచార్య హోటల్ గోవిందాలో బస చేసేదీ…."

ఒక్క ఉదుటున రోడ్డుమీద కురికి బయల్దేరాడు వీరాసామి- తామర తంపర లాంటి జనాన్ని చీల్చుకుంటూ!

—కవితా ప్రసాద్

## ఫారెన్ రిటర్న్‌డ్

"నాకు ఫారెన్ రిటర్న్‌డే కావాలి డాడీ"

"ఏమిటి మాట్లాడుతున్నావో నీకుతెలిసే మాట్లాడుతున్నావా. వసుంధరా?"

"యస్ డాడ్! నేను ఫారెన్ రిటర్న్‌డ్‌ని తప్ప ఎవ్వరినీ పెళ్ళాడను."

"ఫారెన్ రిటర్న్‌డ్ అంటే-మాటలా? లక్షలు పొయ్యాలి!"

"అదేమో. నాకు తెలీదు-నా స్నేహితురాళ్ళందరితోనూ నేను తప్పకుండా ఫారెన్ రిటర్న్‌డ్‌నే పెళ్ళాడుతానన్నాను."

"అఫ్‌కోర్స్! …"

"పోనిద్దురూ. మీరు- మీపీనాసితనమూను ఒక్కగానొక్క పిల్ల…. ముచ్చటపడుతుంది పోతేపోయాయి లక్షలు"

"ఓ. కె- ఐ విల్ ట్రై ఫర్ బ్రైడ్ గ్రూమ్ ఫారెన్ రిటర్న్‌డ్!"

*  *  *

"అమ్మాయ్- వసుంధరా!"

"వాట్ డాడీ?"

"సీ దిస్ ఫొటో! పేరు శివప్రసాద్! ఫారెన్ రిటర్న్‌డ్ డాక్టర్".

"వెరీ ఫైన్ డాడీ!"

"ఎవరబ్బాయండీ ఈ కుర్రాడు?"

చింతలూరి చింపేశ్వరరావుగారి పెద్ద కొడుకు. ఫారెన్‌లో తమ బంధువుల వద్ద పెరిగి. అక్కడ డాక్టరీ పూర్తిచేసి- తల్లి దండ్రుల వద్దకు వచ్చాడు- అమ్మాయికి నచ్చుతుందని తెలిసి (ఎందుకంటే- ఫారెన్ రిటర్న్‌డ్ కదా?) అన్నివిషయాలూమాట్లాడి ముహూర్తాలు పెట్టించేశాను. కట్నం ఎనభై వేలు!"

"వెరీ చీప్ డాడీ!"

"యస్ మైడియర్ డాటర్! డు యు లైక్ దిస్ రిలేషన్?…."

"ష్యూర్!- ఇతను అమెరికానుండా. రష్యా నుండా?…."

"నో. హి ఈజ్ ఫ్రం 'బంగ్లాదేశ్'. ఢాకా వైద్యకళాశాలలో యం.బి.బి.యస్. పూర్తిచేశాడు. సీ- బట్ హి ఈజ్ ఫారెన్ రిటర్న్‌డ్! యు డు నాట్ ఫర్గెట్ ఇట్!"

"డాడ్!!!"

—రొక్కం రమణారావు